‘నందన వనం’.. బురద మయం

- నాలుగు రోజులుగా మురుగు, వర్షపు నీటి మధ్య జీవన పోరాటం
- అర్ధంతరంగా డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో అవస్థలు
- మోకాళ్లకు పైగా చేరిన నీటిలోనే స్థానికుల రాకపోకలు


మోకాలి లోతు నీటిలో స్థానికుల రాకపోకలు

నగరంపాలెం: గుంటూరు నగరపాలకసంస్థ అధికారులకు ప్రజల సమస్యలు ఏమాత్రం పట్టడం లేదు. ఒకవేళ అభివృద్ధి పేరుతో నిర్మాణ పనులు చేపట్టినా, తూతూమంత్రంగా చేయడం మినహా చివరివరకు చేపట్టడం లేదు. వెరసి చుట్టుగుంట కూడలిలోని సుందర నందనవనం (మురికిపేట) నీట మునిగింది. దాదాపు నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు మోకాళ్లకు పైగా వర్షపు నీరు చేరింది. దీంతో ఇళ్లు, గల్లీలు నీట మునిగాయి. ఆ పేటకు అనుకుని మురుగుకాల్వ ప్రవహించడంతో మురుగునీరు సైతం ఇళ్లల్లో చేరింది. ఆ నీటి మధ్యనే పలు కుటుంబాలు జీవన పోరాటం చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ స్పందించని జీఎంసీ ఉన్నతాధికారులు వర్ష ప్రభావంతో ఇళ్లు, రహదారులు మునిగిపోవడంతో గురువారం హడావుడి చేశారు. ఇక మేయర్, పాలకులు పట్టించుకున్న దాఖలాల్లేవు..

డ్రైనేజీ పనుల నిలిపివేతతోనే..

గత నాలుగైదు రోజులుగా గుంటూరు నగరంలో కుండపోత వర్షం కురిసింది. ఈ క్రమంలో ప్రధాన రహదారులతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. ఎటువైపు చూసినా చెరువులను తలపించాయి. ఈ క్రమంలో చుట్టుగుంట వద్దనున్న సుందర నందనవనం (మురికిపేట) నీటిలో మునిగిపోయింది. కొద్ది నెలలు క్రితం విస్తరణ పనుల్లో భాగంగా డ్రైనేజీ పనులు చేపట్టారు. ఈ క్రమంలో సుందర నందనవనం వైపు సైడు కాల్వను కొంతమేర తొలగించారు. దాదాపు ఏడెనిమిది ఇళ్లకు సంబంధించి వెనుక భాగం గదులను తొలగించారు. తొలుత నిర్మాణ పనులను కొంతమేర చేపట్టారు. ఆ తర్వాత ఇనుపరాడ్‌లతో ఫెన్సింగ్ చేసి అమాంతం వదిలేశారు. అప్పటినుంచి ఈ పేట ప్రజలకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. పైనుంచి వచ్చే మురుగంతా ఇక్కడకు వచ్చి నిలిచిపోతోంది. అంతేగాక ఆ మురుగునీరు ఇళ్ల వెనుక పగులకొట్టిన గదుల్లోకి చేరిందని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. చుట్టుగుంట సెంటర్ ప్రధానమైన ఏరియా కావడంతో చిన్న దుకాణాలు వెలిశాయి. ఈ క్రమంలో మాంసపు వ్యర్థాలు, ప్లాస్టిక్ సంచులు, కొబ్బరి బొండాలు, బత్తాయి వ్యర్థాలు, ఇతరత్రా పండ్లు విక్రయించే వారంతా వ్యర్థాలను కాల్వలో విసిరేస్తున్నారు.

ముందే హెచ్చరించిన ‘సాక్షి’



ఈ ప్రాంత వాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుమారు రెండు నెలలు క్రితం జూన్ 9వ తేదీన ‘పేరుకే సుందరం.. అభివృద్ధిలో శూన్యం’ శీర్షికన ‘సాక్షి’ కథనం ప్రచురించింది. కాల్వలో నిలిచిన ప్లాస్టిక్ వ్యర్థాలతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించింది. డ్రైనేజీ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఎదుర్కొంటున్న అవస్థలను సైతం పేర్కొంది. అయినప్పటికి జీఎంసీ అధికారుల్లో ఏమాత్రం చలనం కలగలేదు. వర్షకాలం ముందుగానే నిర్మాణ పనులు పునఃప్రారంభించినట్లయితే ఈ పరిస్థితి తలెత్తిదికాదని స్థానికులు అంటున్నారు.

పట్టించుకునే వారు లేరు..



పేదలు అధికంగా నివసించే ఈ ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోరు. పేరుకు చుట్టుగుంట ప్రధాన కూడలిలో ఉన్నా ఇక్కడ నెలకొన్న సమస్యలు ఎవరికీ పట్టవు. పలుమార్లు వార్డు సచివాలయంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. సాయంత్రమైతే దోమలు విజృంభిస్తాయి. కొద్ది నెలలుగా డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించడంతో ఇబ్బందులు ఎక్కువయ్యాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వర్షపు నీటితోపాటు మురుగునీరు ఇంటిలోకి నిలిచింది. ఆ నీరంతా బక్కెట్లు, చీపుర్లతో చిమ్మడమే సరిపోతుంది.

– కె.నాగేంద్రం, స్థానికురాలు

నాలుగు రోజులుగా అల్లాడిపోతున్నాం



గత నాలుగు రోజులుగా అల్లాడిపోతున్నాం. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వీధుల్లో నడవలేని పరిస్థితి నెలకొంది. ఈ వర్షాలకు మోకాళ్లకు పైగా వర్షపు నీరు చేరింది. దీనికితోడు పక్కనే ఉన్న మురుగునీరు సైతం అందులో కలిసిపోయింది. దీంతో ఆ మురుగులో నడవాలంటే భయంగా ఉంటుంది. ఏమైనా అంటు వ్యాధులు, చర్మ వ్యాధులు వస్తాయని భయంగా ఉంది. కొద్ది రోజులుగా నీటిలో ఉన్న గురువారం వచ్చి అధికారులు పనులు చేపడుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతంలో సమస్యలు తలెత్తకుండా ఉండేలా శాశ్వత దిశగా పనులు చేపట్టాలి

– వల్లెపు ఏడుకొండలు, స్థానికుడు

వస్తువులు పాడయ్యాయి..



వర్షపు నీరు, మురుగునీరు ఏకమై ఇంట్లో ఉండిపోయింది. మురుగునీరు ఫ్రిజ్‌లోకి చేరగా, బీరువా అడుగు భాగం మునిగింది. ఫ్రిజ్‌లోకి నీరు వెళ్లడంతో పాడైపోయింది. ఇక తాగు నీటి సరఫరా లేకపోవడంతో చేసేది ఏమిలేక ఇళ్ల ముందు నిలిచిన నీరుతో ఇల్లు శుభ్రం చేసుకుంటున్నాం.

– దేవరకొండ లక్ష్మి, స్థానికురాలు


మురుగు నీటితో నిండిన ఇంటిని శుభ్రం చేసుకుంటున్న స్థానికురాలు


డ్రైనేజీ పనులు నిలిచిపోవడంతో ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీరు, మురుగు

క్లుప్తంగా

జిల్లా స్థాయిలో ఫ్రీడమ్ ఫెస్ట్ పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జూనియర్ కళాశాలల విద్యార్థుల కోసం జిల్లా స్థాయిలో ఫ్రీడమ్ ఫెస్ట్–2025 నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్యోద్యమంపై క్విజ్, వక్తృత్వం, మోనోయాక్షన్, గానం, గ్రూప్ డ్యాన్స్ పోటీలకు వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఇంటర్మీడియెట్ విద్య ఆర్‌ఐఓ జి.సునీత, కళాకారుడు బసవరాజు జయశంకర్ పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. మధ్యాహ్నం నుంచి ముందస్తు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

త్యాగధనులకు నివాళి అందరి బాధ్యత



లక్ష్మీపురం: దేశస్వాతంత్ర్యం కోసం తృణప్రాయంగా ప్రాణాలు అర్పించి, జీవితాలను ధారపోసిన మహనీయులను స్మరించుకోవడం కనీస ధర్మమని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం త్యాగధనులకు ఘన నివాళులర్పించారు. అనంతరం కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మహనీయుల నిస్వార్థ దేశ భక్తిని పార్టీల పేరుతోనో, వారు అనుసరించిన మార్గాలు, సిద్ధాంతాల పేరుతో కించపరచడం సబబుకాదన్నారు. స్వాతంత్ర్య సాధనలో భిన్నమైన సిద్ధాంతాలు, విభిన్నమైన ఆలోచనలు కలిగి ఉన్నప్పటికీ వారి భావ వైరుధ్యాలు దేశ స్వాతంత్ర్య సాధనకు అడ్డరాలేదన్నారు. అనంతరం సంస్థ సభ్యులతో కలిసి జాతీయ జెండాలతో స్వాతంత్ర్య దిన శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: ఆగస్టు17,18న జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు గడ్డిపాడులోని ఆటోనగర్ ప్రాంతంలో సీపీఐ జిల్లా 26వ మహాసభల వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. చల్లా మరియదాసు, మంగ శ్రీనివాసు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు వైద్య కళాశాలలో రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్టుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శోభారాణిని మెడికల్ అండ్ రీజినల్ డైరెక్టర్‌గా నియమిస్తూ బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సెక్రటరీ మంజుల ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్డీగా బాధ్యతలు స్వీకరించి, జాయినింగ్ రిపోర్టును డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అందించారు. ఆర్డీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ శోభారాణికి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సత్యం, పలువురు సీనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ ఉద్యోగులు, వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో గుండెపోటు, శ్వాస తీసుకోవడంలో కలిగే ఇబ్బందులపై అవగాహన కలిగి ఉండటం ద్వారా చాలామందికి ప్రాణదానం చేయవచ్చునని మెడ్ ఇంపాక్ట్ గ్లోబల్ సంస్థ అసోసియేట్ డైరెక్టర్ రజిని మద్ది పేర్కొన్నారు. రైలుపేటలోని కన్న ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గురువారం విద్యార్థులకు ‘ఎంపవరింగ్ ది యూత్ టు సేవ్ లైవ్స్’ అంశంలో భాగంగా కార్డియో పల్మనరీ రెసిసిటేషన్ (సీపీఆర్) పై అవగాహనతో పాటు రబ్బరు బొమ్మల ద్వారా శిక్షణ పొందిన బేసిక్ కార్డియాక్ లైఫ్ సపోర్టర్స్ మణిదీప్ మువ్వల, ధ్రువన్ రెడ్డి ప్రాక్టికల్స్ చేయించారు. ఈ సందర్భంగా రజిని మద్ది మాట్లాడుతూ కార్డియాక్ అరెస్టు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడే వారికి తక్షణం గుండెపై రెండు అంగుళాల మేర ఒక నిమిషంలో 100 నుంచి 120 సార్లు బలంగా ఒత్తిడి కల్పించడంతో పాటు నోటితో బలంగా శ్వాసను ఇవ్వటం ద్వారా గుండెకు రక్త ప్రసరణ మొదలై మరల కొట్టుకునేలా చేయవచ్చునని వివరించారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళన



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తెలిపారు. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుకను డీఈఓ కార్యాలయంలో కలిసిన యూటీఎఫ్ ప్రతినిధి బృందం వివిధ సమస్యలపై ఆమెకు వినతి పత్రం సమర్పించారు. ఎంఈఓలకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడంలో నిర్దిష్టమైన విధానం లేకుండా పోయిందని, కమిషనర్ ఆదేశాలను పాటిస్తూ ఆర్జేడీ ఉత్తర్వుల ప్రకారం ఎస్.అజయ్‌కుమార్‌కు తుళ్లూరు ఎంఈఓగా బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఎంఈఓలను ఇష్టారాజ్యంగా మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ప్రక్రియ పారదర్శంగా జరగాలని, కొంత మంది ఉపాధ్యాయల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం సరికాదన్నారు. డీఈఓను కలిసిన వారిలో సంఘ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, ఎండీ షకీలాబేగం, ఎ.శ్రీనివాసరావు, కె.కేదార్‌నాథ్ ఉన్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట రూ.40లక్షలు స్వాహా

పట్నంబజారు: ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట గుర్తుతెలియని వ్యక్తి మోసం చేసి రూ. 40 లక్షలు కాజేసిన ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జున్నుసాహెబ్ నగర్‌లో నివాసం ఉండే సయ్యద్ మస్తాన్‌వలి ఆర్మీలో ఉద్యోగం చేసి, 20 సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయ్యారు. నెలరోజుల క్రితం వాట్సాప్ నంబరుకు ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు సంబంధించి ఓ గుర్తుతెలియని వ్యక్తి మెసేజ్ పెట్టాడు. పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చెప్పి నమ్మబలికాడు. అతని మాటలు నమ్మి మస్తాన్‌వలి రూ. 40 లక్షలు పెట్టుబడి పెట్టాడు. సదరు వ్యక్తి వాట్సాప్ పనిచేయకపోగా, ఫోన్ కూడా ఎత్తకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా కళాశాలలో తరగతి గదులు ప్రారంభం


శనక్కాయల అరుణ - గౌరీ శంకర్, ఉమాశంకర్ - రాజకుమారి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో అహల్య చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ రాజకుమారి దంపతులచే మాజీ మంత్రి శనక్కాయల అరుణ పేరుతో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు తరగతి గదులను గురువారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర గల ప్రభుత్వ మహిళ కళాశాలలో విద్యానభ్యసించిన వేలాది మందిలో ఒకరైన మాజీ మంత్రి డాక్టర్ అరుణ పేరుతో కుమారుడు, కోడలు పుట్టినరోజు సందర్భంగా నూతన తరగతి గదులను నిర్మించడం గొప్ప విషయమన్నారు. డాక్టర్ ఉమా శంకర్, డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అధ్యాపకుల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శనక్కాయల అరుణ, గౌరీ శంకర్ దంపతులను ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో పాటు కళాశాల అధ్యాపక బృందం, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎస్.నరేంద్ర కుమార్, ఎస్.చందన, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ విజయలక్ష్మి, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి డి.ఉమా నిశ్చల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

గుంటూరు 178వ సచివాలయాన్ని ముట్టడించిన సీపీఎం నాయకులు


ఐద్వానగర్ వాసులతో మాట్లాడుతున్న సీపీఎం శాఖ కార్యదర్శి గోనే లూథర్‌పాల్, తదితరులు

లక్ష్మీపురం: ఇప్పటికే పెరిగిన కరెంటు చార్జీలతో ప్రజలు సతమతమవుతుంటే ప్రజలను నిలువునా దోచుకునే స్మార్ట్ మీటర్లను జనాల మీదకు వదలడం అన్యాయమని సీపీఎం నాయకులు గోనే లూథర్‌పాల్, ఆది నిక్సన్ అన్నారు. గుంటూరు స్వర్ణభారతినగర్‌లోని ఐద్వానగర్ 178వ సచివాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పెట్టించుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు వర్తించవని చెప్పి అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని చెప్పిన నాయకులే ఇప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టించే పనిని వేగవంతం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్వరం ఇప్పటికే బిగించి ఉన్న స్మార్ట్ మీటర్లను తొలగించి వాటి స్థానంలో పాత డిజిటల్ మీటర్లను మళ్లీ బిగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా విద్యుత్ ట్రూ అప్ చార్జీలు, ఇంధనం సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరారు. అనంతరం 178 సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అంజేశారు. ఐద్వానగర్ వాసులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన గణతంత్ర శుభాకాంక్షలు !



ఈ చిత్రం చూసి, ఇదేంది రిపబ్లిక్ డే నాటి ఫ్లెక్సీగా ఉందే.. అని అనుమానించకండి.. ఈ ఫ్లెక్సీ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిందే.. కాకపోతే సదరు ఫ్లెక్సీలో గణతంత్ర దినోత్సవం అని రాయించారు కూటమి నేతలు. ఫ్లెక్సీ డిజైన్ చేయించేటప్పుడు తమ పేర్లు సరిగా ఉన్నాయో లేదోనని ఒకటికి పది సార్లు చూసుకునే నేతలు తాటికాయంత అక్షరాలతో గణతంత్ర దినోత్సవం అని తప్పుగా పడినా.. దాని వైపు తమ చూపు మరల్చకపోవడం విడ్డూరం. న్యాయవాదుల పేర్లతో.. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఫొటోలు వేయించి, జిల్లా కోర్టుల వద్ద ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీని చూసి అటుగా వెళ్తున్నవారు స్వాతంత్ర్య దినోత్సవం రోజున గణతంత్ర శుభాకాంక్షలా అని నవ్వుకుంటున్నారు. – నెహ్రూనగర్

అలరించిన శ్రీకృష్ణ భక్తి గీతాలాపన



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతీ కల్యాణ వేదికపై గురువారం శ్రీకృష్ణ భక్తి గీతాలాపన నిర్వహించారు. భక్త నారద గానసభ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ పాలకవర్గ కమిటీ జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన ఏపీ విశ్రాంత డీజీపీ ఎం.మాలకొండయ్య, కాళహస్తి సత్యనారాయణలు మాట్లాడారు. అనంతరం సుప్రసిద్ధ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య గీతాలను ఆలపించారు. ఆలోకమే శ్రీబాలకృష్ణం, సతులాల చూడరే, రాధాసమేత కృష్ణ, లీలా శ్రీకృష్ణయ్య, ముద్దుగారే యశోద, సామజవరగమన, జోఅచ్యుతానంద జోజో ముకుందా తదితర కృష్ణ భక్తిగీతాలు అలరించాయి. వయోలిన్‌పై డాక్టర్ ఆంజనేయశాస్త్రి, తబలాపై బాలాజీ వాయిద్య సహకారం అందించారు.

మురికిపేట వాసులకు నిత్యవసరాలు పంపిణీ



నెహ్రూనగర్: నగరంలో వర్షపు నీటికి ప్రభావితమైన చుట్టుగుంటలోని మురికిపేట ప్రాంత ప్రజలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం వర్షపు నీటి ప్రభావిత ప్రాంతాలైన చుట్టగుంట, మురికిపేట ప్రాంతాలలో కమిషనర్‌తో కలిసి మేయర్ పర్యటించారు. కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అచ్చాల వెంకట రెడ్డి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకటకృష్ణయ్య, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్రామి రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ భారీ వర్షాల వలన కారణంగా రోడ్, మేజర్ డ్రెయిన్‌లో లెవల్‌లో ఉన్న చుట్టగుంట మురికిపేటలో సుమారు 50 ఇళ్లల్లోకి నీరు వెళ్లిందని, ఆయా ప్రాంతంలో కల్వర్ట్, అవుట్ ఫాల్ డ్రైన్ నిర్మాణం చేయడం ద్వారా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు. మురికిపేటలో పొక్లెయిన్లు, ట్రాక్టర్లతో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. వర్షం నీటిని డ్రెయిన్‌లోకి మళ్లించడంతో పాటు ఆయిల్ ఇంజిన్ల ద్వారా బెయిల్ అవుట్ చేయడం, ఇసుక బస్తాలు వేసి కాలనీలోకి నీరు వెళ్లకుండా తక్షణ చర్యలు తీసుకున్నారు. ఇన్‌ఛార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీసీపీ సూరజ్ కుమార్, ఇన్‌చార్జి ఎంహెచ్ఓ రామారావు ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణలో ఎన్‌హెచ్ఆర్‌సీ కీలక పాత్ర

- న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని
- విజ్ఞాన్ యూనివర్సిటీలో మానవ హక్కులపై నేషనల్ వర్క్‌షాప్

చేబ్రోలు: మానవ హక్కులకు భంగం కలినప్పుడు బాధితుల తరపున విద్యార్థులు తమ స్వరాన్ని వినిపించాలని న్యూఢిల్లీలోని నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ‘రోల్ ఆఫ్ ఎన్‌హెచ్ఆర్‌సీ (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్) ఇన్ ప్రొటెక్షన్ ఆఫ్ ఫండమెంటల్ అండ్ హ్యూమన్ రైట్స్’అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషన్ మెంబర్ విజయ భారతి సయాని మాట్లాడుతూ వ్యక్తుల ప్రాణం, స్వేచ్ఛ, గౌరవం, సమా నత్వం వంటి మౌలిక హక్కులను కాపాడటంలో ఎన్‌హెచ్ఆర్‌సీ ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ప్రభుత్వ సంస్థలు, పోలీసు, లేదా ఇతర అధికారుల అధికార దుర్వినియోగం వల్ల హక్కులు ఉల్లంఘించబడినప్పుడు, బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించడమే కాకుండా తగిన న్యాయం చేకూరుస్తామన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు గురించి విద్యార్థులకు వివరించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ప్రమాదకరమైన పనుల్లో పని చేయించడం నిషేధమన్నారు. అనంతరం ‘లీగల్ లిటెరసీ అండ్ అవేర్‌నెస్ కాంపెయిన్ అండ్ కాంపీటీషన్స్ ఆన్ చైల్డ్ రైట్స్–2025’కు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, డీన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.